# తరగతి - 9

## కవి పరిచయాలు

## 1. శాంతికాంక్ష

1. 

తిక్కన (ఊహాచిత్రం)

శాంతిని కోరుతూ సందేశమిచ్చిన కవి తిక్కన.

తిక్కన 13వ శతాబ్దానికి చెందిన మహాకవి. తిక్కన మొట్టమొదట 'నిర్వచనోత్తర రామాయణము'ను రచించి మనుమసిద్ధికి అంకితం ఇచ్చారు. తిక్కన రెండోగ్రంథం 'మహాభారతం'. విరాటపర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలు రచించి హరిహరనాథునికి అంకితం ఇచ్చారు.

సంస్కృతాంధ్రాలలో కవిత్వం రాయగలిగిన ప్రతిభాశాలి కాబట్టి 'ఉభయకవి మిత్రుడు' అనీ, కేతనాది కవులకు ప్రేరణ కలిగించి మార్గదర్శకులుగా నిలిచినందుకు 'కవి బ్రహ్మ' అనీ బిరుదులు పొందారు.

## 2. స్వభాష



2. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు 11.2.1865లో రాజమండ్రి - సీతానగరంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు రత్నమాంబ, వేంకటరమణయ్య. ఉన్నత విద్య వరకూ రాజమండ్రిలోనే విద్యాభ్యాసం చేశారు. బళ్ళారి జిల్లాలోని అనెగొంది సంస్థానంలో దివానుగా కొంతకాలం చేసి, తరువాత పిఠాపురం సంస్థానంలో ఆస్థాన కవిగా స్థిరపడ్డారు.

సారంగధర, ప్రచండ చాణక్యము, విప్రనారాయణ, సర్మదా పురుకుత్సీయము రాధాకృష్ణ, పాదుకా పట్టాభిషేకము, కంఠాభరణము, పూర్ణిమ, సరస్వతి, సరోజిని, సాక్షి మొ॥వి వీరి ప్రసిద్ధ రచనలు. వీరి శైలి అద్భుతమైన గ్రాంథిక భాషా ప్రవాహంతో సున్నితమైన వ్యంగ్యంతో, చురుక్కుమనే హాస్యంతో అలరారుతుంది.

సమకాలీన సమస్యలపై తీవ్రంగా స్పందించి, సంఘ సంస్కరణకు నడుంకట్టి, తన రచనల ద్వారా ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించిన పానుగంటివారు చిరస్మరణీయులు. వారి రచనలు ఈనాటి పరిస్థితులకు కూడా అద్దం పడుతున్నాయి. వీరు 1-1-1940న పరమపదించారు.

## 4. శివతాండం

**3.** పుట్టపర్తి నారాయణాచార్యులు (1914-1990) స్వస్థలం అనంతపురం జిల్లా చియ్యేదు గ్రామం. 14 భాషల్లో ప్రవీణులు. 8 భాషల్లో కవిత్వం చెప్పగల దిట్ట. సంగీత, నాట్యశాస్త్రాల్లో సంపూర్ణ పాండిత్యం కలవారు. "సరస్వతీ పుత్ర" వీరి బిరుదు. శివతాండవం, మేఘదూతం, షాజీ, కావ్యమాల, జనప్రియ రామాయణం పండరీ భాగవతం, సాక్షాత్కారం మొదలైన రచనలు చేశారు. 'లీవ్స్ ఇన్ ది విండ్' అనే ఆంగ్ల కావ్యం కూడా వీరి రచనే! వీరు రాసిన శివతాండవం సంగీత సాహిత్య నాట్య సంకేతాల సమ్మేళనం. పుట్టపర్తి రచనల్లో దేశభక్తి, సాంస్కృతికవిలువలు, జాతీయభావాలు, మానవీయ విలువలు తొణికిసలాడతాయి.



## 5. ప్రేరణ

**4.** అందరూ ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ అని పిలిచే డాక్టర్ అబ్దుల్ ఫకీర్ జైనుల్ ఆబిదీన్ అబ్దుల్ కలామ్ 1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామేశ్వరం దగ్గర ధనుష్కోటిలో పుట్టారు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన పట్టుదల, క్రమశిక్షణ, జ్ఞాన జిజ్ఞాసతో ఇంజనీరుగా, శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా తమ సేవలను ఈ జాతికి అందించారు. "ఒక విజేత ఆత్మకథ", (ఇగ్నీటెడ్ మైండ్స్ ది వింగ్స్ ఆఫ్ ఫైర్ -యాన్ ఆటోబయోగ్రఫీ) వంటి రచనలు చేసారు. శాస్త్రరంగంలో విశేష కృషి చేసినందుకుగాను పద్మభూషణ్, పద్మవిభూషణ్‌తో పాటు దేశ అత్యున్నత



పురస్కారం భారతరత్నతోను భారత ప్రభుత్వం సత్కరించింది. దేశవిదేశాల్లోని విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లతో ఆయనను గౌరవించాయి.

**అనువాద రచయిత :** ఆధునిక వచన సాహిత్యంలో విశేషకృషి చేస్తున్న రచయిత శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు. వీరు రచించిన రచనలలో కొన్ని కలలు-కొన్ని మెలకువలు, సహృదయునికి ప్రేమలేఖ, సత్యాన్వేషణ, వందేళ్ళ తెలుగుకథ ప్రముఖమైనవి.

ఈ పాఠంలోని ప్రతి పద్యమూ ఒక విలువైన రత్నమే. ఈ పద్యాలన్నీ వేర్వేరు కవులు రాసిన శతకాల్లోనివి. ఆయా కవుల వివరాలు చదవండి.

## 6. పద్యరత్నాలు

**5.** ఈ పాఠంలోని ప్రతి పద్యమూ ఒక విలువైన రత్నమే. ఈ పద్యాలన్నీ వేర్వేరు కవులు రాసిన శతకాల్లోనివి. ఆయా కవుల వివరాలు చదవండి.

1. శ్రీకర రాజశేఖరా! అనే మకుటంతో ఉన్న పద్యం 'రాజశేఖర శతకం' లోనిది. దీని కర్త 'సత్యవోలు సుందరకవి'. 20వ శతాబ్దికి చెందినవాడు. భక్తిభావం ఉట్టిపడేటట్లు సులభశైలిలో శతకాన్ని రచించాడు.

2,3.'సర్వేశ్వరా!' అనే మకుటంతో ఉన్న పద్యాలు 'సర్వేశ్వర శతకం'లోనివి. వీనిని 'యథావాక్కుల అన్నమయ్య' రచించాడు. ఇతడు 12వ శతాబ్దానికి చెందిన శివకవి. భక్తిభావబంధురమైన కవిత్వం చెప్పగల దిట్ట. వశ్య వాక్కు గలవాడని ప్రసిద్ధి.

4. 'భర్గా! పార్వతీ వల్లభా!'అనే మకుటంతో ఉన్న పద్యం 'కూచిమంచి తిమ్మకవి' రచించిన 'శ్రీభర్గశతకం'లోనిది. ఈయన 17వ శతాబ్దానికి చెందినవాడు. 'నీలా సుందరీ పరిణయం అనే 3 ఆశ్వాసాల ప్రబంధం కూడా రచించాడు.

5. 'భూషణ వికాస శ్రీధర్మపుర నివాస! దుష్టసంహార నరసింహ దురితదూర!' అనే మకుటంతో ఉన్న పద్యం 'కాకుత్థ్సంశేషప్ప కవి' రాసిన 'నరసింహ శతకము'లోనిది. ఇతడు 18వ శతాబ్దానికి చెందినవాడు. గోదావరీ తీరంలోని ధర్మపురి గ్రామంలో వెలసిన నరసింహస్వామిని ప్రస్తుతిస్తూ రాసిన శతకం ఇది.

6. 'నారాయణా!' అన్న మకుటంతో ఉన్న పద్యం నారాయణ శతకం లోనిది. రాసింది బమ్మెర పోతన. 15వ శతాబ్దానికి చెందిన భక్తకవి. "మనస్సుకు ఆహ్లాదకరమైన, అందమైన పద్యాలు చెప్పిన సహజపండితుడు.

7. 'దాశరథీ కరుణాపయోనిధీ!' అనే మకుటంతో ఉన్న పద్యము దాశరథి శతకం లోనిది. దీన్ని రచించిన కవి కంచర్ల గోపన్న. 17వ శతాబ్దానికి చెందినవాడు. ఇతనికే రామదాసు అనే పేరుంది.

8. 'శ్రీకాళహస్తీశ్వరా!' అనే మకుటంతో ఉన్న పద్యం 'ధూర్జటి' కవి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకం లోనిది. ఇతడు 16వ శతాబ్దానికి చెందినవాడు.

9. 'కుమారా!' అనే మకుటంతో ఉన్న పద్యం 'కుమార శతకము'లోనిది. కవి 'పక్కి అప్పలనర్సయ్య'. ఇతడు 16వ శతాబ్దమునకు చెందినవాడు.

10.'సుమతీ! అన్న మకుటంతో ఉన్న పద్యం 'సుమతి శతకం'లోనిది. కవి బద్దెన. ఇతడు 13వ శతాబ్దానికి చెందినవాడు.

## 9. ప్రబోధం



**6.** ప్రబోధం పాఠ్యభాగాన్ని కనుపర్తి వరలక్ష్మమ్మ రాశారు. కనుపర్తి వరలక్ష్మమ్మ గుంటూరు జిల్లా బాపట్లలో 6-10-1896న జన్మించారు. ఆమె భర్త కనుపర్తి హనుమంతరావు ప్రోత్సాహంతో సుమారు 50 కథలు, రెండు నవలలు రచించారు. భారతి, గృహలక్ష్మి, అనసూయ, వినోదవాణి, ఆనందవాణి మొదలైన పత్రికలలో రచనలు చేశారు. గృహలక్ష్మి పత్రికలో సుమారు ఆరు సంవత్సరాలపాటు శారదలేఖలు ప్రచురణ అయ్యాయి. 'లీలావతి' అనే కలం పేరుతో ఆంధ్రపత్రికలో 'మాచెట్టునీడ ముచ్చట్లు' శీర్షికతో రచనలు చేశారు. 'గాంధీ దండకం' రచించారు. దేశభక్తిని, దైవభక్తిని ప్రబోధిస్తూ అనేక పాటలు, పద్యాలు, నాటికలు రచించారు.

## 10. ఆడినమాట

| | | | |
|---|---|---|---|
| **7.** | 'ఆడినమాట' పాఠం కవి | : | అనంతామాత్యుడు |
| | కాలం | : | 15వ శతాబ్దం |
| | నివాసం | : | శ్రీకాకుళక్షేత్ర సమీపంలోని పెనుమకూరు |
| | రచనలు | : | భోజరాజీయం, ఛందోదర్పణం, రసాభరణం |

## 11. చూడడమనే కళ




**8.** జిడ్డు కృష్ణమూర్తిగారు మే 12, 1895న ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. వీరు ఇంగ్లీషులో ధ్యానం, స్వేచ్ఛ, నీవే ప్రపంచం, గరుడయానం మొదలైన రచనలు చేశారు. కృష్ణమూర్తిగారు ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త.

మనిషి తనంతట తానుగా భయం, కట్టుబాట్లు, అధికారం, మూఢవిశ్వాసాల నుండి విముక్తి చెందాలని బోధించారు. అసలైన విప్లవం రావలసినది హృదయపు లోతులలో. మనిషిలో సమూలమైన పరివర్తన కలగకపోతే ఈ యుద్ధాలు,ఈ హింసాకాండ, ఈ విధ్వంసం ఇట్లాగే కొనసాగుతూ ఉంటాయి. తనను తాను పూర్తిగా అవగాహన చేసుకుంటూ హృదయంతో స్పందిస్తూ జీవించడంలోనే పరివర్తన సాధ్యమౌతుంది అని తన రచనల ద్వారా, ప్రవర్తన ద్వారా నిరూపించారు.

## 13. బతుకు పుస్తకం



**9.** సావిత్రిగారు రాజమండ్రి దగ్గర ఉండేశ్వరపురంలో 18-05-1949లో జన్మించారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చదువు అర్థాంతరంగా ఆగిపోయినా సాహిత్య పఠనాభిలాషను కొనసాగించి అనేక కవితలు, కథలు, వ్యాసాలు, సమీక్షలు రాసి స్త్రీవాద సాహిత్యంలో తనదైన స్థానం సంపాదించుకున్నారు. 1991లో వీరి మరణానంతరం ఆమె రచనలన్నీ అరణ్యకృష్ణ సంపాదకత్వంలో "సావిత్రి" పేరుతో వెలువడ్డాయి. వీరి 'బందిపోట్లు' కవిత ప్రసిద్ధమైంది. ప్రగతిశీల దృక్పథం, రాజీలేని పోరాట మనస్తత్వం, పదునైన భావావేశం ఈ రచయిత్రి ప్రత్యేకత.

## 14. భూమిపుత్రుడు



**10.** శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు 09.11.1895న నెల్లూరు జిల్లాలో జన్మించారు. ఈయన 19వ ఏట సాహిత్యరంగంలో ప్రవేశించి నలజారమ్మ, వనకుమారి, కృషీవలుడు, జలదాంగన, యువకస్వప్నము, కడపటి వీడ్కోలు, పానశాల-కావ్యాలను, నక్షత్రశాల-నైవేద్యము, భగ్నహృదయము, పరిశిష్టము, ప్రథమకవిత్వము అనే ఖండకావ్యాలను రచించారు. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచి, లాటిన్, జర్మన్, బెంగాలీ, పర్షియన్, ఉర్దూ, తమిళభాషలలో పండితులు. ఈయన 11.09.1947న కన్నుముశారు. రామిరెడ్డిగారికి 'కవికోకిల' అను బిరుదు ఉంది.

దువ్వూరివారి రచనాశైలి సరళసుందరంగా ఉంటుంది. పాతకొత్తల, ప్రాక్పశ్చిమాల కలయికతో అందాన్ని సంతరించుకున్నది. విశ్వశాంతి, దేశభక్తి, మానవతావాదం, అభ్యుదయం ఈయన రచనలలో ప్రస్ఫుటంగా కనిపిస్తూ మనకు మేలుకొలుపు పాడుతూ ఉంటాయి.

## 15. ధర్మదీక్ష



**11.** పిలకా గణపతిశాస్త్రి 1911 ఫిబ్రవరి 24న జన్మించారు. తూర్పుగోదావరి జిల్లాలోని కట్టుంగ వీరి స్వస్థలం. విజయనగరంలో విద్యనభ్యసించారు. సాహిత్యవిద్యా ప్రవీణ, ఉభయభాషా ప్రవీణ పూర్తిచేశారు. రత్నాపహారం వీరి తొలిరచన. మణిదీపిక, ప్రాచీన గాథాలహరి, విశాలనేత్రాలు, కాశ్మీర పట్టమహిషి, నాగమల్లిక, అందని చందమామ వీరి ఇతర రచనలు. సంస్కృతం, బెంగాలీభాషల నుంచి అనేక అనువాదాలు చేశారు. సరళమైన అలంకారిక శైలిలో వీరి రచన సాగింది.

# నేపథ్యాలు

## 1. శాంతికాంక్ష

**1.** మహాభారతం అన్నదమ్ముల బిడ్డలైన కౌరవ పాండవుల కథ. కౌరవులు కుటిలబుద్ధితో మాయాజూదంలో పాండవులను ఓడించి అడవులపాలు చేస్తారు. పందెం ప్రకారం పన్నెండేళ్ళు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం పూర్తి చేస్తారు పాండవులు. ఆ సందర్భంలో ధర్మరాజు శ్రీకృష్ణుని రాయబారిగా పంపిస్తూ శాంతియుతంగా తమ రాజ్యం తమ కిమ్మని కోరుతాడు.

***ప్రస్తుత పాఠ్యభాగం తిక్కన రచించిన మహాభారతం-ఉద్యోగపర్వం-తృతీయాశ్వాసం లోనిది.***

## 2. స్వభాష

**2.** పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు సంఘ సంస్కరణాభిలాషతో 'సాక్షి' పేరుతో అనేక వ్యాసాలను రాశారు. అందులో భాగంగా మన భాష గొప్పతనాన్ని గూర్చి 'జంఘాలశాస్త్రి' అనే పాత్ర ఉపన్యాసం ద్వారా తెలియజేశారు. ఈ విధమైన ఉపన్యాసాల ద్వారా పానుగంటివారు మనలోని ఆధునిక విపరీతపు పోకడలను వ్యంగ్యంగా చిత్రించి ఎత్తి చూపారు. భాషాభిమానం పెంచడం పాఠం ప్రధాన ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం **పానుగంటి లక్ష్మీనరసింహారావు** గారు రచించిన సాక్షి వ్యాసాలలోని మూడవ సంపుటిలోనిది. ఒక పాఠశాల విద్యార్థులు తెలుగువాడైన ఒక పెద్దమనిషి వద్దకు వెళ్ళి, వార్షికోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించవలసినదిగా కోరారు. ఆయన న్యాయవాద వృత్తి చేస్తూ పేరు గడించినవాడు. 'నేను వస్తానుగాని, తెలుగులో మాట్లాడలేను ఇంగ్లీషులో మాట్లాడతా'నన్నాడు. పిల్లలు సరే అనక తప్పలేదు. సమావేశానికి వచ్చిన ఆ పెద్దమనిషి ఆంగ్లంలో 'దేహసాధన' గురించి పావుగంట మాట్లాడి 'విల్ ఎని జంటిల్మన్ కమ్ ఫార్వర్డు టు స్పీక్' అని ముగించాడు. అప్పుడా సభలోనున్న జంఘాలశాస్త్రి లేచి ఈ విధంగా ఉపన్యసించాడు.

## 4. శివతాండవం

**3.** శివుడి నాట్యంలో కవి సత్త్వరజస్తమో గుణాలను దర్శించాడు. ఆ త్రిగుణాత్మకమైన తాండవంలోని వర్ణనను, అద్భుతమైన లయాత్మకతను పరిచయం చేయడం ద్వారా పిల్లల్లో సృజనాత్మకతను, భాషాభిరుచిని, ప్రకృతి ఆరాధనను పెంపొందింప చేయడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం 'సరస్వతీపుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన 'శివతాండవం' అనే గ్రంథం లోనిది.

**సత్త్వ గుణము –** సాత్వికమైన స్వభావము. మృదువుగా మాట్లాడడం, కోపం లేకుండా శాంతంగా ఉండడం ఈ గుణం ముఖ్యలక్షణాలు.

**రజో గుణము –** రాజస స్వభావము, ఆలోచనకంటె ఆవేశం ఎక్కువ. తొందరగా కోపం వస్తుంది.

**తమోగుణము –** తామస స్వభావము, తమస్సు అంటే చీకటి, బుద్ధి మందకొడిగా ఉండడం. ఏ పనిమీద ఆసక్తి లేకుండా ఉండడం. ఇది సోమరితనము. చాలా హీనగుణము.

## 5. ప్రేరణ

**4.** ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, అత్యున్నత శిఖరాల నధిరోహించిన మహనీయుని జీవితం విద్యార్థులకు ప్రేరణై వారి లక్ష్యనిర్దేశానికి పునాదులు వేయాలన్నదే ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం డా॥ అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలామ్, అరుణ్ తివారిగారితో కలిసి రాసిన 'ఒక విజేత ఆత్మకథ' లోనిది.

## 6. పద్యరత్నాలు

**5.** నైతిక విలువను పెంపొందింపజేసే వివిధ శతకాలలోని నీతులను తెలియజెప్పటం ఈ పాఠ్యభాగ ఉద్దేశం. ఈ పాఠంలోని పద్యాలు వివిధ కవుల శతకాలలోనివి.

(* ఈ పాఠంలోని పద్యాలన్నీ కంఠస్థం చేయాలి.)

## 9. ప్రబోధం

**6.** 'శారదలేఖల'ను పరిచయం చేయడం, స్త్రీలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ప్రబోధించడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన 'శారదలేఖలు' అనే గ్రంథంలోనిది.

## 10. ఆడినమాట

**7.** ఈ ఆవు – పులి కథ భోజరాజీయం కావ్యంలోనిది. సాధువైన ఆవు సత్యసంధత, క్రూరమైన పులి మనస్సును ఎలా మార్చగలిగిందో అనంతామాత్యుడు అత్యంత రమణీయంగా వర్ణించాడు.

ప్రస్తుత పాఠ్యభాగం 'భోజరాజీయము' లోని షష్ఠాశ్వాసంలోనిది.

## 11. చూడడమనే కళ

**8.** వినడం, మాట్లాడడం, చూడడం, పరిశీలించడం, శ్రద్ధ చూపడం వంటి జీవన నైపుణ్యాలను తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం జిడ్డుకృష్ణమూర్తి ఆంగ్లరచన A Timeless Spring కు అరుణామోహన్ అనువాదమైన "అనాది స్రోతస్సు" లోనిది.

## 13. బతుకు పుస్తకం

**9.** పుస్తక పరిచయంలో ఒక్కొక్కరిదీ ఒక్కోవిధం. రచయిత్రి 'బతుకుపుస్తకం' పుస్తకం మీద ఏర్పరచుకున్న ప్రత్యేకాభిమానం ఈ రచనలో తెలుస్తుంది. పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయడాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠం 'సావిత్రి' సమగ్ర రచనా సంపుటిలోనిది.

## 14. భూమిపుత్రుడు

**10.** రైతు తొలకరితో వ్యవసాయక్షేత్రంలో ప్రవేశించి విత్తువిత్తి, కలుపుతీసి, మందుచల్లి, నీరుగట్టి, పసిబిడ్డలా పైరును పోషించుకుంటాడు. పంటను నూర్చి కళ్ళాల నుండి ధాన్యాన్ని ఇంటికి చేర్చే రైతు మనకే కాక పశు పక్ష్యాదులకు కూడా ఆహారాన్ని ప్రసాదిస్తున్నాడు. అలాంటి రైతును గురించి తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

భూమి పుత్రుడు పాఠం దువ్వూరి రామిరెడ్డి గారు రాసిన "కృషీవలుడు" అనే కావ్యం లోనిది.

## 15. ధర్మదీక్ష

**11.** పిల్లల్లో సున్నిత భావన పెంపొందించి అన్ని ప్రాణులనూ జాలితో, దయతో చూడాలనే ఆలోచన పెంపొందింప చేయడం, ఎవరిపని వాళ్ళు సక్రమంగా చేస్తే సత్ఫలితాలు వాటంతట అవే వస్తాయని చెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠం పిలకా గణపతి శాస్త్రి గారు రాసిన 'ప్రాచీన గాథాలహరి' అనే పుస్తకంలోనిది.

# ప్రక్రియాలు

## 1. శాంతికాంక్ష

1. 'ఇతిహాసం' అనే పదానికి 'ఈ విధంగా జరిగింది' అని అర్థం. ఇతిహాసంలోని ఇతివృత్తం వాస్తవంగా జరిగినదై ఉంటుంది. రామాయణ మహాభారతాలు మన ఇతిహాసాలు.

## 2. స్వభాషం

2. విషయ ప్రాధాన్యం ఉండి ఒక క్రమంలో సమగ్రంగా వివరించిన దాన్ని వ్యాసం అంటారు.

అధిక్షేపమంటే ఎత్తిపొడుపు. ఇది వివిధ విషయాలపట్ల విమర్శ దృష్టితో వ్యంగ్య, హాస్యధోరణిలో వ్యాఖ్యానిస్తూ, పరిష్కారమార్గాన్ని సూచిస్తూ సాగే సాహిత్య ప్రక్రియ.

## 4. శివతాండవం

3. గేయ కవిత పాడుకోవడానికి అనువైనది. మాత్రా ఛందస్సును అనుసరించి నడుస్తుంది. లయాత్మకంగా సాగుతుంది.

## 5. శివతాండవం

4. ఒక వ్యక్తి తన జీవిత విశేషాల్ని తానే గ్రంథస్థం చేసుకుంటే అది ఆత్మకథ. ఆత్మకథనే స్వీయచరిత్ర అని కూడా అంటారు. ఇందులో సమకాలీన విశేషాలు ప్రతిబింబిస్తాయి. రచయిత అనుభవాలే కాక ఆ కాలం నాటి సాంఘిక, ఆర్థిక రాజకీయ పరిస్థితులు తెలుస్తాయి. ఇతరులకు ప్రేరణ కలిగిస్తుంది. ఇది ఉత్తమ పురుష కథనంలో ఉంటుంది.

## 6. పద్యరత్నాలు

5. నూరు పద్యములు గల రచనను 'శతకం' అంటారు. సాధారణంగా శతకాలలో నూరు నుండి నూట ఎనిమిది పద్యాలుంటాయి. శతక పద్యాలకు మకుటం ప్రధానం. మకుటం అంటే కిరీటం. ఇది శతక పద్యాల్లో ప్రతి పద్యం చివర ఉంటుంది. ఇది పదంగా గాని, అర్ధపాదంగా గాని, పాదంగా గాని, పాదద్వయంగా గాని ఉండవచ్చు. శతకంలోని పద్యాలు ముక్తకాలు. అనగా ఏ పద్యానికదే స్వతంత్ర భావంతో ఉంటుంది.

## 9. ప్రబోధం

**6.** వ్యక్తుల మధ్య, సంస్థల మధ్య పరస్పరం సందర్భాన్నీ, సంబంధాన్నిబట్టి రాసుకునేవి లేఖలు. కొందరు ప్రముఖవ్యక్తుల ఉత్తరాలను సాహిత్యంగా పరిగణించడం జరుగుతుంది. ఇవి ఆ వ్యక్తుల అభిప్రాయాలనూ, వివిధ వ్యక్తులతో వాళ్ళకున్న పరిచయాలను, సంబంధాలను, సమకాలీన సమాజ జీవనాన్ని, పరిణామాలను తెలియజేస్తాయి.

లేఖలను విమర్శకులు మూడు రకాలుగా విభజించారు. వ్యక్తిగత లేఖలు, వ్యాపార లేఖలు, బహిరంగ లేఖలుగా వీటిని పేర్కొనవచ్చు.

## 10. ఆడినమాట

**7.** వివిధ కథల సమాహారం కథాకావ్యం. ఇందులో వస్తు ప్రధానమై రమణీయ కథన శోభితమై, మనోరంజనంతో పాటు నీతిని, వ్యవహార దక్షతను, కార్య కుశలతను, ధర్మ ప్రబోధాన్ని, ఉత్తమ గుణాలను పెంపొందించే కథావళి ఉంటుంది.

## 13. బతుకు పుస్తకం

**8.** ఏదైనా ఒక పుస్తకాన్ని సమగ్రంగా చదివి, అందులోని విషయాల్ని సంక్షిప్తంగా పరిచయం చేస్తూ, గుణదోషాల్ని తెలియజేయడమే పుస్తక పరిచయం అంటారు. ఇది చదవగానే ఆ పుస్తకం మీద ప్రాథమిక అవగాహన, చదవాలనే ఆసక్తి కలుగుతాయి.